# మలయ మారుతం

—గ్లాస్గోపంచె .... జరీనంబరు పాదంమీద పరచుకునేట్టుగా .... అంచు పద్మాగ్రంలాగా అమరికగా బంగాళీకట్టూ..అల్లిక బనియన్ .... ఉల్లిపొర .... గిరల లాల్చీ .... పక్కజేబులో ఘుమాయించే జేబురుమాలు .... పై జేబులో ఆకారం, అంకెలూ, చూచాయగా కనబడుతూ, పదిరూపాయల నోట్ల బొత్తి....బుగ్గను రూపాయి కిళ్ళీ ....

.... అనుకున్న ప్రకారం వేళకు సరిగా .... ఆ గుమ్మం ఎక్కాడు .... సత్యం ....

తలుపు ఓరవాకిలిగా ఉన్నది. చెప్పుల చప్పుడు విని .... లోపలి నుంచి "వచ్చె .... వచ్చె...." అనుకుంటూ .... ఆ అమ్మాయి తల్లి .... హాలులో దీపం పెద్దది చేసి, తలుపు తీసి "రా నాయనా" అని పలుకరించి, గుమ్మంలోకి వచ్చి, వీధి అటూ ఇటూ తొంగిచూసి, వెనుకనుంచి తలుపు వేసింది ....

...."కూర్చోండి అలా నిలుచుంటారే. ఇప్పుడే .... యిందాకటినుంచీ మీరు వస్తారుకదా అని యిక్కడే కూర్చుని .... ఇప్పుడే లోపలికి వెళ్ళాను, పాలల్లో తోడువేసి వద్దామని .... మీరూ రానే వచ్చారు .... అమ్మాయీ ! .... వారు వచ్చారే...."

చంద్రం .... అవతల వసారాలోంచి .... ఆ పక్కగదిలోకి వెళుతూ తన వేపు చూసి ఒక్కమారు తళుక్కుమన్నది. సత్యం .... జేబులోనుంచి పైకంతీసి, ముసలిదానికి యివ్వబోయినాడు.

"నాకెందుకు బాబూ! మీవంటివారు మా యింటికి రావడం .... అమ్మాయి అదృష్టముకొద్దీ — అదే నాకు పదివేలు....ఇక మీ యిష్టం....మీ యిష్టం....యిచ్చు కోండి, మానుకోండి. నేనల్లా చూసి సంతోషించడమే...." అని....లోపలికి చక్కా బోయింది.

చంద్రం ఏ గదిలోకి వెళ్ళిందో....సత్యం....అందులోనే ప్రవేశించాడు.... కలకలలాడుతూ ఉంది....

లేచి నిలుచుని....సోఫామీద నుంచి....నవ్వుతూ....కనులతో పలుకరించింది... చొరవగా చేజాపి పట్టుకోబోయినాడు....కొంటెగా తప్పించుకుని తలుపువేపు తల విసిరింది....వెళ్ళి గడియ వేశాడు....

"ఇదుగో....ఇంద—" జేబులోనుంచి .... నోట్లు బయటకు తీస్తున్నాడు, చంద్రం కోపంగా....

"డబ్బు....మీరే ఎరుగున్నారు. నే మెన్నడూ డబ్బు మొగమే చూడలేదు.... ఆ బల్లమీద పారేయండి...."

జవాబు చెప్పకుండా....అయిదునోట్లూ — ఆమెకు కనబడేలాగున విడబరచి లెక్కపెట్టినట్లు నటించి, మళ్ళా బొత్తిచేసి .... బల్లమీద పొందాను .... ఎత్తు పెట్టాడు....

"కూర్చోండి...."

"నీవు కూడా... ఇక్కడ...."

"మీకు ఎదురుగా....ఇక్కడ."

"ఉహుఁ....ఇక్కడ నా పక్కను."

"అమ్మ....ఆశే....మీరు మంచి పిల్లవాళ్ళుకారు."

సత్యానికి....యీ చెలగాటం అదో సరదాగా ఉంది. ఖరీదు యిచ్చి కొను

క్కున్నా....ఆ మాట అని రసాభాసం చేసుకోవడంకంటె....యిదీ బాగానే వుంది....
కొత్తగా సంసార పక్షంగా....

"వీణ....వాయించనా...."

—"అక్కరలేదు"....అని తల ఊగించాడు .... చంద్రం త్రాచులాగా లేచింది...."మీరేం సరసులు....మొక్కు తీర్చుకోడమైతే .... యిక్కడకు రావడం దేనికి? .... యింటి దగ్గరనే....పడి వుంటే....యీ పాటికి పక్కంతా చెల్లా చెదురూ చేసుకొని....యిల్లాలూ మీరూ విదురపోతూ వుండేవారుగా .... యిందుకోసం.... యీ ఖర్చంతా ఎందుకు?..,యింతే ఈ కాలంవాళ్ళు....కొనుక్కుందామని వుబలాటమే కాని....తీరా అక్కడకు వచ్చేటప్పటికి....అనుభవించడం చేతకాదు...."

"పోనీలే....వింటాను...."

"ఏం....నన్ను ఉద్ధరించడానికా?....నా పాట వినడానికి యింతకన్న ఎవరూ దొరకరనా....చెప్పండి....యిదేం బలవంతం బ్రాహ్మణార్థంకాదు....సరసాలేమీ నేరువ కుండా....అందుకోసమే వచ్చానంటే....నేను కాదనను....మిమ్మల్ని ఎంతో ఒప్పించా లని....మల్లె మొగ్గల వంకీజడ వేయించుకున్నాను....పాము కుబుసంలాంటి వుప్పాడ చీరె....మొగలి చాయ రవిక....యిదిగో యీ ప్రక్కనుండి పండు వెన్నెల....మీరు చక్కగా....నవ మన్మధులులాగా నాచేత గంధం పూయించుకుని, పన్నీరు చల్లించు కుని....హాయిగా....నేను మీ యెదుట కూర్చుని వీణె వాయించిన తర్వాత .... అమీద....నామీద ప్రేమతో....ఎంతో అనుకున్నాను....మీరు వస్తారని కబురు పంపి నప్పటినుంచీ మిమ్మల్ని మెప్పించడానికి....ఎన్నో ఊహించాను. పోనీండి....మీకు అవన్నీ వెగటై....అదొక్కటే, అవసరమైతే....ఎన్ని కోరికలున్నా .... ఎప్పుడూ మా బ్రతుకింతేకదా....మాకు దొరికేవారు....ఎన్నడూ ఈపాటివారేకదా అని.... ఒక్క నిట్టూర్పు విడిచి ఊరుకుంటాను .... చెప్పండి........మీకు మొగమాట మెందుకు?...."

"—నేనంత పశువును కాను....నిన్ను చూడగానే .... మనసు నిలుపలేక పోయినాను కాని....నొప్పించాలని కాదు....నాకూ హృదయం ఉన్నది .... అనుభ వించాలనే కోరిక ఉన్నది....అందుకనే నిన్ను వెదుక్కుంటూ వచ్చింది...."

"అంత ధర పెట్టింది:"

"ఆ మాట అనకు....నాకు చిన్నతనం వేస్తుంది .... తల వంచుకోవలసి

వస్తుంది....అన్నీ కొనగలమా....ఐశ్వర్యము ఎంత ఉండనీ .... అందులోనూ, నిన్ను...."

"—ఎంతవారండీ....నా మనస్సు కనుక్కోవాలని వేసిన పన్నాగమా యిది అంతా....నాకూ తెలియక కాదులెండి....చూడగానే పోల్చుకున్నాను. అయినా, ఏ దారికి వస్తారో అని....అమ్మదొంగా...."

— సత్యం కొంచెం యిరకాటంలోనే పడ్డాడు.

గడియారం ముళ్ళు రెక్కలు కట్టుకున్నంత వేగంతో....కాలాన్ని గిరగిర లాడించుతూన్నవి. బింకానికిపోయి....పెద్దచిక్కు తెచ్చిపెట్టుకున్నాడు....“ప్రొద్దు చాలా పోయింది....సంగీతం గింగీతం యిప్పుడు వద్దులే....” అంటే చంద్రం అతిచులకనగా చూస్తుంది. “సానికూతురి ఎన్నికలో అంత వాసి చెడటం....ఎంత మాత్రమూ పరువైన పనికాదు....కాదు, కూడదు ....” అంటే ఒప్పుకోక ఏం చేస్తుంది? కాని.... ఆఖరికి....ఆ అమ్మాయి తనను అసహ్యించుకోవడమా? ....

ఎన్ని కప్పుల టీ త్రావినా....అందుకోసం పవలంతా నిద్రపోయినా....వేసుకున్న కిళ్ళీ పూరాగా వేడిచేసి....మత్తుగా, తమాషాగా....ఏలాగో ఉంది ఒంట్లో.... అయినా....ముందు, ఒకసారి ముద్దిడుకోనిచ్చినా....ఉహూం .... చంద్రం దగ్గరకే రాందే....

“ఒప్పుకున్నాను కాని....ఒక్క ముద్దు....” అని రాబోయే నిదురను బలవంతాన బిగబట్టి....పసివాడిలాగా బతిమాలుతూ అడిగాడు....

“ఊం....ఇప్పుడా?....మెప్పుకు .... అనక ఆ బహుమానాలు!”........అని నవ్వుతూ....తివాచీమీద కూర్చుని....చంద్రం వీణె సారించింది.

—చల్లని....గాలి....ఒళ్ళు మరిపించే....పాట!

—తెల్లవారి....ఒంటరిగా మేలుకున్న తరువాత .... అనుకుని ఉసూరుమన్నాడు....అప్పుడు అల్లా కూర్చున్న చోటనే నిదురపోయినానుకదా అని.... అనుకుని మాత్రం ఏం లాభం....కోపం అంతా ఎదురుగుండా గవిసెనలేని వీణమీద చూపించాడు....ఒకటి రెండు తీగెలు పుటుక్కుమనిపించి....వంచిన తల ఎత్తకుండా.... మంచులో తడిసిన మల్లెపువ్వులాగా....చెక్కు చెదరకుండా....యింటికి వచ్చి.... మంచంమీద నిదురకు ఒ్రాలాడు.